డైనమిక్

జనం వాయిస్

PRGI NO:TGTEL/26/A0383

తెలుగు దినపత్రిక

WWW.JANAMVOICE.COM



తెలంగాణ & ఏపీ ఎడిటర్: గట్టు మహేష్ గౌడ్ గురువారం 05-11-2026 సంపుటి: 01 సంచిక : 306 పేజీలు : 12

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది

రాహుల్ గాంధీ.

భగవంత్ మాన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర వ్యక్తిగత విమర్శలు.
రోజూ మద్యం సేవించే సీఎం డ్రగ్స్‌పై పోరాడలేరని వ్యాఖ్య.
పంజాబ్ పాలన కేజ్రీవాల్, అమిత్ షా చేతుల్లో ఉందని ఆరోపణ.
రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగితేనే యువతకు ఉపాధి లభిస్తుందని సూచన.
ప్రధాని మోదీతో చర్చకు తాను సిద్ధమంటూ మరోసారి సవాల్.

2



బస్సులో మహిళా ఎంపీ చెంపపై కొట్టిన కాంగ్రెస్ ఎంపీ.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రాజకీయ దుమారం.
కాంగ్రెస్ తీరుపై కేంద్రమంత్రి అథవాలే, శివసేన నేత నిరుపమ్ విమర్శలు.
అది సరదా సంఘటన మాత్రమేనని స్పష్టం చేసిన మహిళా ఎంపీ ప్రతిభా ధనోర్కర్.
రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపణ.

2



భూమి వైపు దూసుకొస్తున్న నాసా స్పేస్ టెలిస్కోప్.

భారత్‌లోనూ శకలాలు పడే అవకాశం!
భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించనున్న నాసా స్విఫ్ట్ టెలిస్కోప్.
2004లో ప్రయోగించిన అబ్జర్వేటరీకి 22 ఏళ్ల చరిత్ర.
2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించిన టెలిస్కోప్.
శకలాలు పడే పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు.
చాలా భాగం వాతావరణంలోనే కాలిపోతుందని అంచనా.

2



కరెంట్ బిల్లులకు అదనపు బాదుడు.

- ఈ నెల నుంచే ట్రూ అప్ ఛార్జీలు!
- నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు.. డిసెంబర్ నుంచి 50 పైసలు.
- విద్యుత్ వినియోగదారులపై రూ.5,420 కోట్ల అదనపు భారం.
- మొత్తం రూ.7,635 కోట్ల ట్రూ అప్ వసూళ్లకు టీజీఈఆర్‌సీ అనుమతి.
- వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,215 కోట్ల భారం ప్రభుత్వానిదే.
- గృహజ్యోతి లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లు ఉపశమనం.



జనం వాయిస్, హైదరాబాద్, నవంబర్ 04:

తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు అదనపు కరెంట్ బిల్లుల భారం మొదలైంది. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోళ్లు, ఇతర వ్యయాలకు సంబంధించిన బకాయిలను వసూలు చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు ట్రూ అప్ ఛార్జీలను అమలు చేస్తున్నాయి. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) అనుమతితో నవంబర్ బిల్లుల నుంచి ఈ వసూళ్లు ప్రారంభమయ్యాయి. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున అదనపు ఛార్జీలు విధించనున్నారు.- మిగతా 2 లో...

కోమటిరెడ్డికి మంత్రి పదవి ఇక కలేనా?

- హామీ ఇచ్చి మూడేళ్లయినా నెరవేరని అధిష్ఠానం మాట.
- నిధుల కేటాయింపులో వివక్ష అంటూ రాజగోపాల్‌రెడ్డి ఆవేదన.
- అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరిక.
- మంత్రి పదవి దక్కకపోవడానికి జిల్లాలో రాజకీయ సమీకరణాలే కారణమా?.

జనం వాయిస్, నల్లగొండ, నవంబర్ 04:

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మంత్రి పదవి హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఆయనలో అసహనం పెరుగుతున్నట్లు తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, పలుమార్లు మంత్రివర్గ - మిగతా 2 లో...



గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లపై కాంగ్రెస్‌లో పోటీ!

- మూడు స్థానాల కోసం 30 మందికి పైగా నేతల ప్రయత్నాలు
- సామాజికవర్గాల వారీగా ప్రాతినిధ్యం కల్పించాలంటూ డిమాండ్లు
- ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఆశావహుల ఒత్తిడి

2



రూ.2 కోట్ల లంచం ఆరోపణలు.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి.
2006 నాటి లంచం ఆరోపణలపై దర్యాప్తు.
రూ.2 కోట్లు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ సాజన్ ఫిర్యాదు.
సెక్షన్ 17(ఏ) కింద విచారణకు ఆమోదం.
ముఖ్యమంత్రి సతీశన్‌తో చర్చించినట్లు హోంమంత్రి వెల్లడి.

2

జనం వాయిస్, డెస్క్, నవంబర్ 04:

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి




ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే..!

ఈ నెల 23న ఏపీలోని మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం.
ధికారికంగా తేదీని ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం.
13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలకు కొత్త పాలకవర్గాలు.
డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాని వైనం.
ప్రత్యక్ష ఎన్నికల నేపథ్యంలో కొత్త నిబంధనలు జారీ చేయనున్న ఎస్ఈసీ.

ఏఐ మాయతో రియల్ ఎస్టేట్ మోసాలు!

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రచారంతో అమాయకులకు టోకరా.
అనుమతులు లేని వెంచర్లకు భారీ ప్రాజెక్టులుగా కృత్రిమ హైప్.
సామాన్యులు, ఎన్ఆర్ఐల పెట్టుబడులే లక్ష్యంగా మోసాలు.
ప్లాట్లు కొనేముందు రెరా, ప్రభుత్వ అనుమతులు పరిశీలించుకోవాలి.

2



PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి

మద్యం వాసన వచ్చేది

జనం వాయిస్, డెస్క్, నవంబర్ 04:

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు. గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.

బస్సులో మహిళా ఎంపీ చెంపపై కొట్టిన కాంగ్రెస్ ఎంపీ.


జనం వాయిస్, డెస్క్, నవంబర్ 04:

కాంగ్రెస్ ఎంపీ శ్యామ్‌కుమార్ బర్వే.. తన సహచర మహిళా ఎంపీ ప్రతిభా ధనోర్కర్‌ను చెంపదెబ్బ కొడుతున్నట్లుగా ఉన్న ఒక వీడియో దుమారం రేపుతోంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీకి బస్సులో వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే, శివసేన నేత సంజయ్ నిరుపమ్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. అయితే, ఈ వివాదంపై ఎంపీ ప్రతిభా ధనోర్కర్ స్పందించారు. తన సోదరుడి లాంటి సహచర ఎంపీతో చాలా తేలికగా, సరదాగా జరిగిన సంభాషణను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం వైరల్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. "నా ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ప్రత్యర్థులు ఈ ఘటనను వాడుకుంటున్నారు. దివంగత మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ వారసురాలిని, ఆడపులిని నేను. ఇలాంటి దుష్ప్రచారాలకు భయపడను, మరింత ధైర్యంగా నిలబడతాను" అని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే తీవ్రంగా స్పందించారు. ఒక మహిళపై చేయి చేసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "కాంగ్రెస్ పార్టీ మహిళలను గౌరవించాలి. కానీ వారి చర్యలు అలా కనిపించడం లేదు. మహిళపై చేయి ఎత్తడం తప్పు. ఆ ఎంపీ వెంటనే క్షమాపణ చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ వీడియో చాలా అభ్యంతరకరంగా ఉందని, ఇది చూశాక కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. "ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ ర్యాలీకి వెళుతూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవానికి భంగం కలిగించడం సిగ్గుచేటు" అని అన్నారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి చెందిన బర్వే, ధనోర్కర్ ఇద్దరూ కాంగ్రెస్ ఎంపీలు. తన భర్త, మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ మరణం తర్వాత ప్రతిభ చంద్రపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో చుట్టూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి.

భూమి వైపు దూసుకొస్తున్న నాసా స్పేస్ టెలిస్కోప్.

జనం వాయిస్, డెస్క్, నవంబర్ 04:

దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్ష రహస్యాలను ఛేదించిన నాసా స్పేస్ టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించేందుకు సిద్ధమైంది. దాని కక్ష్యను పెంచి మరికొంతకాలం సేవలు అందించేలా చేసేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోకి ప్రవేశించే సమయంలోనే కాలిపోతుందని అంచనా వేస్తున్నారు. అయితే, కొన్ని భాగాలు మాత్రం శకలాల రూపంలో భూమిని చేరే అవకాశం ఉంది. 2004లో ప్రయోగించిన ఈ అబ్జర్వేటరీ విశ్వంలో అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా భావించే గామా కిరణాల విస్ఫోటనాలను అధ్యయనం చేసేందుకు రూపొందించారు. తొలుత రెండేళ్లపాటు పనిచేసేలా దీన్ని రూపొందించినప్పటికీ, రెండు దశాబ్దాలకు పైగా సేవలందించింది. ఈ కాలంలో 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించి, వాటి సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందించింది. సూపర్‌నోవాలు, బ్లాక్‌హోల్స్, ఇతర ఖగోళ వస్తువుల అధ్యయనంలోనూ కీలక పాత్ర పోషించింది. సూర్యుడిపై పెరిగిన కార్యకలాపాల కారణంగా భూమి ఎగువ వాతావరణం విస్తరించింది. దీంతో కక్ష్యలో ఉన్న స్విఫ్ట్ టెలిస్కోప్‌పై వాతావరణ ఘర్షణ ప్రభావం పెరిగి, అది క్రమంగా కిందికి దిగడం ప్రారంభించింది. దాని కక్ష్యను పెంచేందుకు నాసా 'లింక్' అనే రోబోటిక్ అంతరిక్ష నౌకను పంపించింది. అయితే, ఆ నౌకలో తలెత్తిన నియంత్రణ సమస్యలతో టెలిస్కోప్‌ను పై కక్ష్యకు చేర్చే ప్రయత్నం విఫలమైంది. నాసా, అమెరికా అంతరిక్ష దళం అంచనాల ప్రకారం.. టెలిస్కోప్ భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించే సమయం మారే అవకాశం ఉంది. దాని కక్ష్యను బట్టి శకలాలు పడే అవకాశం ఉన్న ప్రాంతం భూమధ్యరేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో 20.6 డిగ్రీల అక్షాంశాల మధ్య ఉంటుంది. ఈ పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, ఏ ప్రాంతంలో శకలాలు పడతాయన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేము. నాసా అంచనా ప్రకారం.. భూమిపై ఎవరికైనా హాని కలిగే ప్రమాదం చాలా తక్కువగా ఉంది. ఒకరికి హాని కలిగే అవకాశం సుమారు 2,100 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. శకలాలు సముద్రంలో పడే అవకాశమే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నాసా, అమెరికా అంతరిక్ష దళం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.



రూ.2 కోట్ల లంచం ఆరోపణలు.

జనం వాయిస్, డెస్క్, నవంబర్ 04:

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు. మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు. గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

కరెంట్ బిల్లులకు అదనపు బాదుడు.

జనం వాయిస్, హైదరాబాద్, నవంబర్ 04:


తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు అదనపు కరెంట్ బిల్లుల భారం మొదలైంది. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోళ్లు, ఇతర వ్యయాలకు సంబంధించిన బకాయిలను వసూలు చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు ట్రూ అప్ ఛార్జీలను అమలు చేస్తున్నాయి. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) అనుమతితో నవంబర్ బిల్లుల నుంచి ఈ వసూళ్లు ప్రారంభమయ్యాయి. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున అదనపు ఛార్జీలు విధించనున్నారు.

రూ.7,635 కోట్ల వసూళ్లకు అనుమతి

2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ అప్ మొత్తాన్ని వసూలు చేసుకునేందుకు టీజీఈఆర్‌సీ అనుమతించింది. ఇందులో రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.

నవంబర్‌లో 30 పైసలు.. డిసెంబర్ నుంచి 50 పైసలు

విద్యుత్ వినియోగదారుల నుంచి నవంబర్ నెలలో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ఛార్జీలను సాధారణ విద్యుత్ ఛార్జీలతో కలపకుండా బిల్లులో ప్రత్యేకంగా చూపించాలని టీజీఈఆర్‌సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వసూళ్లు, ఎంత వినియోగాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారనే వివరాలను కూడా బిల్లులో పేర్కొనాల్సి ఉంటుంది.



26 నుంచి 29 నెలల పాటు వసూళ్లు

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) పరిధిలో 29 నెలల పాటు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో 26 నెలల పాటు ఈ వసూళ్లు కొనసాగనున్నాయి. ఆయా వినియోగదారుల గత విద్యుత్ వినియోగ వివరాల ఆధారంగా ట్రూ అప్ మొత్తాన్ని లెక్కించనున్నారు.

గృహజ్యోతి లబ్ధిదారులకు ఉపశమనం

ప్రభుత్వ గృహజ్యోతి పథకం కింద అర్హత కలిగి నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు జీరో బిల్లు సదుపాయం కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉపశమనం కలుగుతోంది. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను పరిశీలించి, ట్రూ అప్ ఛార్జీల వివరాలను గమనించాలని విద్యుత్ సంస్థలు సూచిస్తున్నాయి.

కోమటిరెడ్డికి మంత్రి పదవి ఇక కలేనా?

జనం వాయిస్, నల్లగొండ, నవంబర్ 04:



తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మంత్రి పదవి హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఆయనలో అసహనం పెరుగుతున్నట్లు తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, పలుమార్లు మంత్రివర్గ విస్తరణ జరిగినప్పటికీ ఆయనకు అవకాశం దక్కలేదు. తాజాగా గట్టుప్పల్ మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన రాజగోపాల్‌రెడ్డి.. మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, తన నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు కూడా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే పదవి ఇవ్వడం లేదని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా వెనుకాడనని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలను ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే రాజకీయ హెచ్చరికగా పలువురు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడానికి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉండటం, వారిలో ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఉండటం వంటి రాజకీయ సమీకరణాలు కారణమని ప్రచారం జరుగుతోంది. సామాజికవర్గ సమీకరణాలు కూడా పదవి కేటాయింపులో ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అధిష్ఠానం తనకు న్యాయం చేస్తుందని, సరైన సమయంలో మంత్రి పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన రాజగోపాల్‌రెడ్డి.. ఇప్పుడు బహిరంగంగానే అసంతృప్తిని వెళ్లగక్కడం కాంగ్రెస్ పార్టీలో చర్చకు కారణమైంది. ఆయన వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, ఆయన అనుచరులు కూడా సోషల్ మీడియాలో పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా మంత్రి పదవి ఆశలు, నియోజకవర్గ అభివృద్ధి నిధుల అంశం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరలేపాయి.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లపై కాంగ్రెస్‌లో పోటీ!

- మూడు స్థానాల కోసం 30 మందికి పైగా నేతల ప్రయత్నాలు.
- సామాజికవర్గాల వారీగా ప్రాతినిధ్యం కల్పించాలంటూ డిమాండ్లు.
- ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాల నుంచి ఆశావహుల ఒత్తిడి.

జనం వాయిస్, హైదరాబాద్, నవంబర్ 04:

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలపై పలువురు కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. తమకు అవకాశం కల్పించాలంటూ పార్టీ పెద్దల వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మూడు స్థానాల కోసం 30 మందికి పైగా



నాయకులు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ పదవుల భర్తీలో పార్టీ కోసం కష్టపడిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలా? లేక సామాజికవర్గాల సమీకరణాలకు అనుగుణంగా ఎంపిక చేయాలా? అనే అంశంపై చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. మంత్రి వర్గంలో కొందరికి అవకాశం కల్పించినప్పటికీ, తమ వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఎస్సీ మాదిగ సామాజికవర్గం నుంచి దొమ్మేటి సాంబయ్య పేరు ముందువరుసలో వినిపిస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సన్నిహితుడిగా పేరున్న ప్రీతమ్ కూడా ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, చారుకొండ వెంకటేష్ తదితరులు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి వేణుగోపాల్ తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు సమాచారం. బీసీ కోటాలో అనిల్, కైలాష్, జగదీశ్వర్, జక్కని అనిత తదితరుల పేర్లు కూడా ఆశావహుల జాబితాలో వినిపిస్తున్నాయి. దాదాపు పదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నేతలతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలోకి వచ్చిన నాయకులు కూడా ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఓట్ చోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి కేంద్రీకరించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికారిక కసరత్తు ఇంకా ముందుకు సాగలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, సీనియారిటీ వంటి అంశాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో ఈ ఎంపిక ప్రక్రియ రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఏఐ మాయతో రియల్ ఎస్టేట్ మోసాలు!

జనం వాయిస్, హైదరాబాద్, నవంబర్ 04:

డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రచారమే కొందరు రియల్ ఎస్టేట్ మోసగాళ్లకు పెట్టుబడిగా మారుతోంది. ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రముఖ యూట్యూబ్ ఛానెళ్లపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు బోగస్ వెంచర్లను భారీ ప్రాజెక్టులుగా చిత్రీకరిస్తున్నారు. ఆకర్షణీయమైన వీడియోలు, భారీ లాభాల హామీలతో సామాన్యులు, ఎన్నారైలను పెట్టుబడుల వైపు మళ్లించి మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. మార్కెట్లో సరైన గుర్తింపు లేని, వివాదాల్లో ఉన్న వెంచర్ల యజమానులు సోషల్ మీడియాలో ఎక్కువ ఫాలోయింగ్ ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రచారం చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం భారీ మొత్తంలో డబ్బులు చెల్లిస్తూ ప్రాజెక్టులకు విపరీతమైన ప్రచారం కల్పిస్తున్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం తాము స్వయంగా వెంచర్‌ను పరిశీలించినట్లు, భవిష్యత్తులో కోట్ల రూపాయల లాభాలు వస్తాయంటూ ప్రమోషనల్ వీడియోలు విడుదల చేస్తున్నారు. ఈ ప్రచారాన్ని నిజమని నమ్ముతున్న కొనుగోలుదారులు తమ జీవితకాల సంపాదనను పెట్టుబడిగా పెట్టి ఇబ్బందుల్లో పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు కొన్ని వెంచర్లకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో పాటు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కూడా ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల భూములు ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివాదాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సృష్టించే కృత్రిమ ప్రచారాన్ని నమ్మి ముందడుగు వేసిన కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ సమయంలో అసలు పరిస్థితి తెలిసి ఆందోళనకు గురవుతున్నారు. చివరకు న్యాయం కోసం పోలీస్ స్టేషన్లు, న్యాయవాదులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో కనిపించే ఆకర్షణీయమైన ప్రకటనలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలనే ఆధారంగా చేసుకుని ప్లాట్లు కొనుగోలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు. ఏదైనా వెంచర్‌లో పెట్టుబడి పెట్టే ముందు తెలంగాణ రెరా రిజిస్ట్రేషన్ ఉందా? సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు ఉన్నాయా? భూమికి సంబంధించిన యాజమాన్య హక్కులు, వివాదాల పరిస్థితి ఏమిటి? అనే అంశాలను స్వయంగా పరిశీలించుకోవాలి. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తర్వాతే పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రచారం నిజానికి హామీ కాదు.. భూమి పత్రాలు, అనుమతులే పెట్టుబడికి అసలైన భరోసా!

ఏపీలో మేయర్, చైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే..!

జనం వాయిస్, ఆంధ్రప్రదేశ్, నవంబర్ 04:

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన పురపాలక ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 23న వారు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారని ఎస్ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ప్రజలు నేరుగా తమ నగర సారథులను ఎన్నుకోవడంతో, గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ఎస్ఈసీ తేదీని ఖరారు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది. అయితే, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పదవుల ఎన్నికకు సంబంధించిన తేదీలు, విధివిధానాలపై ఎస్ఈసీ నుంచి ప్రత్యేకంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో ఈ పదవులను పరోక్ష పద్ధతిలో కౌన్సిలర్లు ఎన్నుకునేవారు. అయితే, ఇప్పుడు మేయర్లు, చైర్‌పర్సన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగినందున, డిప్యూటీ పదవుల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఎస్ఈసీ కొత్త మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. నవంబరు 23న మేయర్లు, చైర్‌పర్సన్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయి పాలకవర్గాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటివరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.



PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

సమస్యలు గాలికొదిలేసి.. గాలిమోటార్లలో

తిరుగుతున్న రేవంత్‌రెడ్డి!

- 23 రోజులుగా సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల గోడు పట్టదా?.
- సమాన పనికి సమాన వేతనం కల్పించాలి.
- మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వకపోవడం అనాగరికం.
- ఉద్యోగ భద్రత, వైద్య బీమా సదుపాయాలు కల్పించాలి.
- సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది.
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.

జనం వాయిస్, పెద్దపల్లి, నవంబర్ 04:

ప్రజా సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాలిమోటార్లలో ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. 23 రోజులుగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల





సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల్లో సుమారు 90 శాతం మంది మహిళలే ఉన్నారని, అలాంటి ఉద్యోగులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా కల్పించకపోవడం అనాగరికమని పుట్ట మధూకర్ మండిపడ్డారు. మహిళా ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్, ఈఎస్ఐ వంటి వైద్య సదుపాయాలు, బీమా పథకాలు, ఎక్స్‌గ్రేషియా కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలనే న్యాయమైన డిమాండ్‌ను కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, గ్రామీణ పేదలకు వైద్య సేవలు అందించడంలో వారి కృషి ఎంతో ముఖ్యమన్నారు. అలాంటి ఉద్యోగులు 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 90 సార్లు ఢిల్లీకి వెళ్లారని, పదేపదే ఢిల్లీ పర్యటనలు చేయడం వెనుక కారణమేమిటో ప్రజలకు అర్థం కావడం లేదని పుట్ట మధూకర్ విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రజల ఇబ్బందుల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ఢిల్లీ పర్యటనలు, హెలికాప్టర్ ప్రయాణాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని ప్రయాణాల కోసం ఖర్చు చేసే బదులు ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని హితవు పలికారు. అధికారంలోకి రాకముందు ఉద్యోగుల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారి ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ, ఉద్యోగులకు పీఆర్సీ వంటి అంశాలపై గొప్ప హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి నేడు వాటి అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, వైద్య బీమా, ఈఎస్ఐ, ఈహెచ్‌ఎస్ సదుపాయాలు కల్పించాలని పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఆదివారంపేటలో కమ్యూనిటీ

కాంటాక్ట్ ప్రోగ్రామ్

- ప్రజలకు మరింత చేరువగా పోలీసు శాఖ.
- గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం.
- అనుమానాస్పద వ్యక్తులు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.
- మంథని సీఐ స్వామి.

జనం వాయిస్, రామగిరి, నవంబర్ 04:

ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువ కావడంతోపాటు గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా రామగిరి మండలం ఆదివారంపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ స్వామి పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ స్వామి సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని వివరించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, సమస్యల పరిష్కారానికి ముందుంటారని తెలిపారు. ప్రజలు పోలీసులపై నమ్మకంతో తమ సమస్యలను తెలియజేయాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ద్వారా ప్రజలు, పోలీసుల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి, ముత్తారం ఎస్సైలు తాడవేని శ్రీనివాస్, రవికుమార్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



మంథని తహసీల్దార్ కార్యాలయంలో

మూలనపడ్డ ప్రజావాణి దరఖాస్తులు!

- కలెక్టర్ ఆదేశాలకు తూట్లు.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.
- మూడు నెలలుగా పెండింగ్‌లో రైతు పట్టా దరఖాస్తు.
- దరఖాస్తు తెరిచి చూడలేదంటున్న బాధిత రైతు.
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్.

జనం వాయిస్, మంథని, నవంబర్ 04:

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంథని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండటంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఆరోపించారు.

మూడు నెలలుగా కదలని రైతు దరఖాస్తు


మంథని మండలానికి చెందిన ఓ యువ రైతు తన భూ సమస్య పరిష్కారం కోసం మండల ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. సర్నేపల్లి సమీపంలోని శివారు సర్వే నంబర్‌లో ఉన్న 2.28 గుంటల భూమికి సంబంధించి తన తండ్రి పేరు మీద పట్టా పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ 31-



08-2026న దరఖాస్తు సమర్పించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం DPDPL31 నంబర్‌తో రసీదు జారీ చేసి, దరఖాస్తును మంథని ఎంఆర్ఓ కార్యాలయానికి పంపినట్లు పేర్కొన్నారు. అయితే దరఖాస్తు సమర్పించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కనీస విచారణ కూడా జరగలేదని, దరఖాస్తు ఏ దశలో ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సురేష్ తెలిపారు.

ప్రజావాణి లక్ష్యం నీరుగారుతోందా?

ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ మండల స్థాయిలో దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.



కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి మంథని తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించాలని గొర్రెంకల సురేష్ కోరారు. ముఖ్యంగా బాధిత రైతు భూ సమస్యపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

సదర్ సమ్మేళన ఉత్సవాల్లో

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందడి!

- హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం.
- రాష్ట్ర మంత్రులతో కలిసి పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే.
- యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు.

జనం వాయిస్, హైదరాబాద్, నవంబర్ 04:

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే శ్రీకృష్ణ సదర్ సమ్మేళన ఉత్సవాలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనగా, రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ రాష్ట్ర మంత్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదర్ సమ్మేళన ఉత్సవాల ప్రాధాన్యతను, యాదవుల ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను నాయకులు కొనియాడారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. సంప్రదాయ కళలు, సాంస్కృతిక వైభవం, సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా ఈ వేడుకలు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా యాదవ సమాజంలో ఉత్సాహాన్ని నింపిన ఈ సదర్ సమ్మేళనం సంప్రదాయాల పరిరక్షణకు వేదికగా నిలిచింది.



సింగరేణిలో రాజకీయ జోక్యం.. కార్మికుల హక్కులకు సంకెళ్లు!

- కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- లేకుంటే మరిన్ని ఆందోళనలు తప్పవు
- ఆర్జీ-1 జీఎం కార్యాలయ ముట్టడిలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరిక.

జనం వాయిస్, గోదావరిఖని, నవంబర్ 04:

సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో కుదిరిన ఒప్పందాలు రాజకీయ జోక్యం కారణంగానే అమలుకు నోచుకోవడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

23 డిమాండ్ల ఒప్పందం ఏమైంది?

కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో 2026 జూన్ 8న సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. అనంతరం రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో ఆగస్టు 27న యాజమాన్యంతో 23 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందన్నారు. ఒప్పందం ప్రకారం అమలు చేయాల్సిన అంశాలపై సర్క్యులర్లు జారీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మెడికల్ బోర్డు నిర్వహణలోనూ నిర్లక్ష్యం

ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చి మూడు నెలలు నిర్వహించిన అనంతరం నిలిపివేయడం అన్యాయమన్నారు. 2022 ఏప్రిల్‌లో మారుపేర్ల సమస్యపై కుదిరిన ఒప్పందం, ప్రభుత్వ కమిటీ నివేదిక వచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. ముఖ్యంగా 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

డిపెండెంట్ ఉద్యోగాలపై హామీ ఏమైంది?

వీటీసీ పూర్తి చేసిన మిగిలిన అర్హులైన డిపెండెంట్ అభ్యర్థులందరికీ నెల రోజుల్లోపు నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని ఎల్లా గౌడ్ ఆరోపించారు. అర్హులైన సింగరేణి కార్మికులందరికీ సొంత ఇంటి పథకాన్ని అమలు చేస్తామని చెప్పి నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు.

గనుల్లో భద్రతా పరికరాల కొరత

గనుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన బూట్లు, హెల్మెట్లు, బిట్లు, డ్రిల్ రాడ్లు, యంత్రాలు, హెచ్‌ఈఎంఎం యంత్రాల స్పేర్ పార్టులు, టైర్లు తక్షణమే సరఫరా చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు



పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని, అవసరమైన పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించేలా చర్యలు తీసుకోవడం లేదని ఎల్లా గౌడ్ ఆరోపించారు. ఆ బకాయిలను వెంటనే వసూలు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. యూనియన్ల మధ్య పోటీతత్వం కార్మికులకు ప్రయోజనం కలిగించేలా ఉండాలే తప్ప, రాజకీయ జోక్యంతో కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించకూడదన్నారు.

ఎన్నికలకు ఏఐటీయూసీ సిద్ధం

గత పదేళ్లపాటు టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసి, ఇప్పుడు ఎన్నికల నిర్వహణపై కోర్టును ఆశ్రయించడం హాస్యాస్పదమని విమర్శించారు. ఏఐటీయూసీ ఎన్నికలకు సిద్ధంగా ఉందని, ఎన్నికలంటే భయపడే సంఘం కాదని స్పష్టం చేశారు. ఇతర సంఘాలు కార్మికుల సమస్యల



పరిష్కారానికి పోరాడాలని, గుర్తింపు సంఘంపై విమర్శలకే పరిమితం కాకూడదని సూచించారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరిన్ని ఉద్యమాలు

సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యం తగ్గించాలని, ఆర్ఎల్‌సీ సమక్షంలో కుదిరిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని మడ్డి ఎల్లా గౌడ్ డిమాండ్ చేశారు. ముట్టడి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి సీఎండీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని కార్మికుల పెండింగ్ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, సహాయ కార్యదర్శి మాదన మహేష్, ఉపాధ్యక్షులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, నాయకులు ఎస్. వెంకట్ రెడ్డి, సిద్ధమల్ల రాజు, దొంత సాయన్న, ఎం. చక్రపాణి, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు, బొల్లి శ్రీనివాస్, ఏ.వి.ఎస్. ప్రకాశ్, తాళ్లపెల్లి శ్రీనివాస్, మారుపేర్ల బాధితుల సంఘం నాయకులు లంక శ్రావణ్ గౌడ్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.